ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా ఎగరాలి

- ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ
- పాల్గొన్న జాయింట్ కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

అనకాపల్లి టౌన్ : ప్రజలలో దేశభక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పిలుపునిచ్చారు. ఈ నెల 8 నుంచి జరగుతున్న హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు హర్ ఘర్ తిరంగా యాత్ర ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం కోసం అహర్నిశలూ శ్రమించి స్వాతంత్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామని తెలిపారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు ఈ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొన్నాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఇంటి మీద జాతీయ పతాకం ఎగురవేయడం ద్వారా స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణ, ఆర్డీవో షేక్ అయిషా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, వివిధ శాఖల అధికారులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్ట్

నర్సీపట్నం : హత్యాయత్నం కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని టౌన్ ఇన్‌ఛార్జీ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. వెలమవీధికి చెందిన పి.వి.నాయుడుతో కాపువీధికి చెందిన ఎస్.రవికిరణ్, ఎం.త్రిమూర్తులు, ఎస్.లోవకుమార్ వైన్ షాపు సమీపంలోని పాన్‌షాప్ వద్ద బజ్జీల తినే విషయంలో గొడవ పడ్డారు. ఈ క్రమంలో పి.వి.నాయుడును చంపేందుకు ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు వెయ్యి ఎకరాలు

మాకవరపాలెం: పరిశ్రమల ఏర్పాటు కోసం వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేస్తున్నామని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడారు. మండలంలోని రామన్నపాలెం వద్ద ఏపీఐఐసీ ఆధీనంలో 300 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూముల్లో ఉన్న జంగిల్‌ను తొలగించే పనులు చేయిస్తున్నామన్నారు రాచపల్లి రెవెన్యూ పరిధిలోని యరకన్నపాలెంలో ఉన్న ప్రభుత్వ భూములను కూడా పరిశ్రమల స్థాపనకు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ ఉన్నారు.

ముందస్తు స్వాతంత్ర్య, కృష్ణాష్టమి వేడుకలు



భారతదేశ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

కె.కోటపాడు : అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం ముందస్తు స్వాతంత్ర్య, శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. భారతదేశం నమూనా ఆకారంలో విద్యార్థులు కూర్చుని జాతీయ పతాకం ప్రదర్శించారు. పలువురు విద్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టుకొని జైహింద్ అంటూ నినాదాలు చేశారు. అలాగే శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు.

స్వాతంత్ర్య చరిత్రకు ఆనవాళ్లు.. ఈ స్థూపాలు

చోడవరం: బ్రిటిష్ పాలనలో చోడవరానికి ఒక ప్రత్యేక స్థానమే ఉంది. ఒక పక్క మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజు స్వాతంత్ర్యం ఉద్యమం చేసే రోజుల్లో ఈ ప్రాంతం నుంచి అనేక మంది భాగస్వామ్యమై వందేమాతరం అంటూ అడుగులో అడుగు వేయగా.. మరో పక్క హార్డింజ్ అనే బ్రిటిష్ గవర్నర్ చోడవరం కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతంలో పన్నులు వసూలు చేశారు. ఆ బ్రిటిష్ అధికారి విశ్రాంతి తీసుకోవడానికి ఇక్కడ ఓ గెస్ట్ హౌస్ కూడా అప్పట్లో నిర్మించారు. అదే చోడవరం హార్డింజ్ గెస్ట్ హౌస్. నాటి చరిత్రకు నేటికీ సాక్ష్యాలుగా ఉన్న కట్టడాలు ఇక్కడ ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15న దేశంలో నిర్మించిన అతి కొద్ది జెండా స్థూపాల్లో ఒకటి చోడవరంలో ఉంది. ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యానికి ఈ జెండా స్థూపాలే నిలువెత్తు నిదర్శనం.

స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావస్తున్నా నాటి జెండా స్థూపాలు అమరవీరుల త్యాగఫలాన్ని నేటి తరానికి గుర్తు చేస్తూనే ఉన్నాయి. బ్రిటిష్ కాలం నుంచి నేటి భారతం వరకు ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకున్న చోడవరంలో ఉన్న రెండు జెండా స్థూపాలకు ఎంతో చరిత్ర ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రకటించిన క్షణమే దేశ వ్యాప్తంగా మువన్నెల జెండా ఎగురవేసేందుకు పలు చోట్ల రాత్రికి రాత్రే సంబరాల నడుమ జెండా స్థూపాలను నిర్మించారు. అప్పుడు నిర్మించిన జెండా స్థూపాల్లో



చోడవరంలో నాడు బ్రిటీష్ జెండా ఎగిరి, నేడు భారతీయ జెండా ఎగురుతున్న వందేళ్లనాటి హార్డింజ్ గెస్ట్‌హౌస్, ఆ ఆవరణంలో నాటి జెండా దిమ్మ

చోడవరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన స్థూపం ఒకటి. ఈ జెండా స్థూపానికి నేటికి 77 ఏళ్లు. బ్రిటిషు ప్రభుత్వంలో అప్పటి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన డి.రామదాసు ఈ జెండా స్థూపాన్ని నిర్మించి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. తుప్పుపట్టని మిశ్రమ లోహంతో తయారు చేసిన ఇనుప గొట్టంతో ఈ జెండా దిమ్మను నిర్మించారు. అందుకే ఈ స్థూపం ఎన్ని దశాబ్దాలైనా చెక్కుచెదరలేదు.

హార్డింజ్ గెస్ట్ హౌస్ వద్ద బ్రిటిష్ జెండా ఎగిరేందుకు గెస్ట్ హౌస్ బంగ్లాకు ఎదురుగా ఒక స్థూపాన్ని నిర్మించి దాని చుట్టూ ఒక వృత్తాకారంలో దిమ్మను కట్టారు. ఆ స్థూపం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. తెల్లదొరలు దేశాన్ని వదిలివెళ్లిపోయారని



చోడవరం తహసీల్దార్ కార్యాలయంలో 1947 ఆగస్టు 15న నిర్మించిన జెండా దిమ్మ

తెలిసిన వెంటనే ఈ స్థూపంపై బ్రిటిష్ జెండాను దించి భారతీయ మువ్వన్నెల జెండాను అప్పటి స్థానికులు ఎగురవేశారు. సుమారు వందేళ్ల కిందట నిర్మించిన ఈ స్థూపం చరిత్రకు సాక్ష్యంగా నిలిచింది. ఈ రెండు స్థూపాలు స్వాత్రంత్య ఉద్యమానికి ఆనవాళ్లుగా ఈ ప్రాంతంలో ఉన్నాయి. హార్డింజ్ గెస్ట్‌హౌస్‌లో ఇటీవల మహాత్మా గాంధీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ రెండు చోట్ల ఈ నెల 15న స్వాతంత్ర్య వేడుకలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ డోలీమోతలు ఇంకెన్నాళ్లు!



డోలీ యాత్రతో నిరసన తెలుపుతున్న డొంకాడ గిరిజనులు

- రోడ్డు వేయాలంటూ డొంకాడ గిరిజనుల నిరసన

నర్సీపట్నం : గ్రామానికి రహదారి నిర్మించాలంటూ గొలుగొండ మండలం, డొంకాడ గిరిజనులు అబిద్‌సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు డోలీ యాత్ర నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ డొంకాడ గ్రామంలో కొందు గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నారన్నారు. జీవో నెంబరు 726 ఇంపాక్ట్ నిధుల నుంచి పంచాయతీకి 2023లో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఫారెస్ట్ క్లియరెన్స్ పూర్తయినప్పటికీ నేటికి అధికారులు రోడ్డు పనులు మొదలు పెట్టలేదన్నారు. రహదారి సౌకర్యం లేక డోలీ మోతతో వైద్యం కోసం గర్భిణులు పాంగి మువ్వల, కొండ తామల జ్యోతి, సీత మార్గం మధ్యలో మరణించడం జరిగిందన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, స్కూల్ లేక కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. చందాలు వేసుకుని నడవడానికి వీలుగా గ్రామస్తులే రోడ్డు వేసుకుంటున్నారన్నారు. డొంకాడతో పాటు పిత్రిగడ్డ, నీళ్ల బంద, పెద్ద గరువు గ్రామాలకు రోడ్లు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు డొంకాడ గ్రామానికి రోడ్డు వేయాలని లేని పక్షంలో పంచాయతీ కార్యాలయం ముందు నిరసనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో ఏవో, పీఆర్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో తాంబలి సత్తిబాబు, గేమిల సుబ్బారావు, తాంబూలా అప్పారావు, సీఐటీయు జిల్లా కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

రావికమతం: మండలంలో దొండపూడిలో వెలిసిన గ్రామ దేవత దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారి గుడి వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, కంబాల జోగులు, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ తాతయ్యబాబు, జనసేన ఇన్‌చార్జ్ పి.వి.ఎస్.ఎన్.రాజు, ఎంపీపీ పైల రాజు, మాడుగుల ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ సన్యాసినాయుడు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అధిక సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, కంబాల జోగులు, తదితరులు

400 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ

కె.కోటపాడు : చౌడువాడ పంచాయతీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 400 అడుగుల జాతీయ జెండాతో హైస్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పంచాయతీ కార్యదర్శి బి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి: తెనుగుపూడి బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 100 మీటర్ల జాతీయ జెండాతో గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక గురుకుల విద్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ ఎస్.విక్టర్‌పాల్ జాతీయ జెండా ఊపీ ప్రారంభించారు.

రావికమతం: మండల కేంద్రం రావికమతంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీడీపీవో మంగతాయారు, ఎంపీడీవో సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: తూటిపాలలో ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ముందస్తుగా జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా రంగులు, వాటి ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, భవాని పాల్గొన్నారు.

నర్సీపట్నం: వేములపూడిలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బోళం ముత్యాలపాప, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడ శీరంరెడ్డి సూర్యనారాయణ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు.

నాతవరం: నాతవరం మెయిన్‌రోడ్డు మీదుగా 75 అడుగులు జాతీయ జెండాతో మండల స్థాయి అధికారులు, విద్యార్థులు జైహింద్ అంటూ నినాదాలు చేసుకుంటూ మండల కార్యాలయాల వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కామిరెడ్డి వరహాలబాబు, బ్రహ్మజీ, నాతవరం హైస్కూల్ హెచ్ఎం కూండ్రపు సత్యనారాయణ, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సబ్బి కుమారస్వామి పాల్గొన్నారు.



చౌడువాడలో 400 అడుగుల జాతీయ జెండాతో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం



నాతవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో వరహాలబాబు, విద్యార్థులు

చెట్టు కూలి బైకుపై వెళ్తున్న వ్యక్తి మృతి



చెట్టు పడి చనిపోయిన శ్రీనివాసరావు

పాయకరావుపేట రోడ్డు పక్కన వున్న పెద్ద చెట్టు పడి డెక్కన్ కెమికల్స్‌లో పని చేస్తున్న ఉద్యోగి మృతి చెందాడు. సీఐ జి.అప్పన్న అందించిన వివరాలివి. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం, దూళ్లపేటకు చెందిన తోట శ్రీనివాసరావు(34) డెక్కన్ కెమికల్స్‌లో ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నీషియన్‌గా ఇఅండ్‌హెచ్ క్రాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. శ్రీనివాసరావు గురువారం ఉద్యోగరీత్యా కంపెనీకి వెళ్తున్నాడు. రాంభద్రపురం దాటిన తర్వాత రోడ్డుకి కుడివైపున వున్న పెద్ద గన్నెరు వృక్షం ఉదయం 8.30 గంటల సమయంలో నేలకొరిగి బైక్‌పై వెళ్తున్న శ్రీనివాసరావుపై పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరావుతో పాటు బైక్‌పై ప్రయాణిస్తున్న మరో ఉద్యోగి ప్రమాదం నుంచి తప్పించుకోగా, స్వల్పగాయాలయ్యాయి. అతనిని తుని ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చెట్టు కింద పడి ఉన్న శ్రీనివాసరావు మృతదేహాన్ని రోడ్డును తొలచి బయటకు తీసారు. తుని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. డెక్కన్ కెమికల్స్ యాజమాన్యం పడిపోయిన చెట్ల క్రేన్ సహాయంతో తొలగించారు.

ఘనంగా భూలోకమ్మ ఆలయ ప్రారంభోత్సవం

బుచ్చెయ్యపేట: పీపీ అగ్రహారంలో గ్రామ దేవత భూలోకమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. పూర్వం నిర్మించిన అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులంతా కలిసి పునర్నిర్మించారు. పురోహితుల సమక్షంలో శాస్త్రోక్తంగా అమ్మవారి ఆలయ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ శిఖర గోపురం స్థాపనలో పలువురు గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



ఆలయ శిఖర గోపురం ప్రతిష్టాపనలో పాల్గొన్న భక్తులు

మేడిచర్లలో 167 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు : మేడిచర్ల గ్రామంలో గురువారం సంచార చికిత్సలో భాగంగా 167 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య మాట్లాడుతూ వైద్యుల సూచన మేరకు బీపీ, సుగర్ మాత్రలు వేసుకోవాలన్నారు.

60 టన్నుల యూరియా పంపిణీ

కె.కోటపాడు : మండలంలో 11 రైతు సేవా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సాగుకు అవసరమైన 60 టన్నుల యూరియాను అందించినట్లు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలో కొరువాడ, ఎ.కోడూరు, కె.జె.పురం, మేడిచర్ల గ్రామాల్లో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. రాయితీ ధరకు బస్తా యూరియాను రైతులకు రూ.270కు అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా మరో 24 టన్నుల యూరియా శుక్రవారం నాటికి రానున్నట్లు సోమశేఖర్ చెప్పారు. కార్యక్రమాల్లో రైతు సేవా కేంద్రాల వ్యవసాయ శాఖ సహాయకులు అప్పలనాయుడు, కళ్యాణి, జనార్దనతో పాటు కొరువాడలో పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తి, కె.కోటపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు చీపురపల్లి రామారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెనుగుపూడిలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే

దేవరాపల్లి: తెనుగుపూడి గ్రామంలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే చేపట్టారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే స్టేట్ సూపర్‌వైజర్ జి.సుధీర్ గ్రామంలోని అంగన్‌వాడీ, పాఠశాల, హెల్త్ సెంటర్, ఇళ్లల్లో మరుగుదొడ్లను పరిశీలించారు. వినియోగిస్తున్నారా? లేదా? పరిశుభ్రంగా ఉన్నాయా? లేదా? అని తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపడుతున్నారా? కాలువలు శుభ్రం చేస్తున్నారా? లేదా? స్వయంగా పరిశీలించారు. చెత్త సంపద తయారీ కేంద్రానికి తడి, పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ జరుగుతుందా? లేదా? అని ఆరా తీశారు. జలజీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, స్థానిక పంచాయతీ కార్యదర్శి కామరాజు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, ఎంఆర్‌సీ పైడిరాజు, వెలుగు వీవో ఉప్పు రమణ పాల్గొన్నారు.



తెనుగుపూడిలో సర్వే పాల్గొన్న స్టేట్ సూపర్‌వైజర్ జి.సుధీర్, తదితరులు

ఉత్తమ సేవలతో ప్రజల్లో ఆదరాభిమానాలు


కె.కోటపాడు : ఉత్తమ సేవలతోనే ప్రజల్లో ఆదరాభిమానాలు పొందవచ్చునని, అలా ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తూ ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ కె.శ్రావణ్‌బాబు మన్ననలు పొందడం అభినందనీయమని వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, ఎంపీటీసీ రాజేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్ అన్నారు. ఇటీవల విజయవాడకు బదిలీ అయిన చౌడువాడ ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌బాబును గురువారం వారు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అంకాబత్తుల పైడిరాజు, కొత్తూరు శ్రీనివాసరావు, దనిమిశెట్టి పైడినాయుడు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

నర్సీపట్నం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్నారన్నారు. వీరికి వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.25 వేలు భృతి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రాజు, అనిల్, శ్రీను, సత్తిబాబు తదితర్లు పాల్గొన్నారు.



తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆటో కార్మికులు

బంగారుమెట్ట కో-ఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీను

బుచ్చెయ్యపేట: బంగారుమెట్ట కో-ఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జిగా దొండా శ్రీను గురువారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా సాయం అయ్యన్నదొర, ఒంటెద్దు సాంబమూర్తి సొసైటీలో రైతుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. రైతు సంఘ నాయకులు తమరాన దాసు, సాయం శేషు, మెల్లి శ్రీను, మేరుగు బాబూరావు, దొండా వెంకటరమణ, కుమార్, తదితరులు వారిని అభినందించారు.

బకాయి జీతాల కోసం నైట్ వాచ్‌మెన్ల వినతి

రావికమతం: హైస్కూల్‌లో పని చేస్తున్న నైట్ వాచ్‌మెన్లకు ఆరు నెలల బకాయి వేతనాలను తక్షణం చెల్లించాలని కోరుతూ జిల్లా వాచ్‌మెన్‌ల సంఘం అధ్యక్షుడు బొర్రా చంటిబాబు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. దొండపూడి గ్రామంలో జరిగిన దుర్గాలమ్మ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. జీతాలు లేక అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామని వాపోయారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కారం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయ పంటలకు మంచి మద్దతు ధర

మాడుగుల రూరల్ : రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని ఆత్మ పథక సంచాలకురాలు ఆశాదేవి సూచించారు. మండలంలో కొత్తపల్లి గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆశాదేవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన పంటలకు మంచి మద్దతు ధర లభిస్తుందన్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సహాయ వ్యవసాయ సంచాలకురాలు శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి అనసూయ, వ్యవసాయ విస్తరణాధికారి సతీష్, ఆత్మ బీటీఎం లక్ష్మి కిషోర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం: జి.కోడూరు ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ నర్సీపట్నం ఈఈ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. మాకవరపాలెంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి నిరంతరం విద్యుత్ సరఫరాలో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించనున్నట్టు పేర్కొన్నారు. కోడూరు ఫీడర్ పరిధిలోని రాచపల్లి, జి.నగరం, సుభద్రయ్యపాలెం, చౌడువాడ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా రామ్‌కుమార్

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మళ్ల రామ్‌కుమార్‌కు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.వి.ఎస్.ఎస్.శాస్త్రి తెలిపారు. శుక్రవారం ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ భవనంలో ఈ అవార్డు అందుకోనున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామ్‌కుమార్‌ను కళాశాలలో సత్కరించారు.



రామ్‌కుమార్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి తదితరులు

నారుపోసే నాథుడేడీ..!

- వరి నారుకు బాగా డిమాండ్
- కొనాలన్నా దొరకని పరిస్థితి
- సకాలంలో వర్షాలు లేక ఎండిపోయిన నారుమడులు

చోడవరం : ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడుతున్నప్పటికీ నాట్లు వేసేందుకు వరి నారు కొరత తీవ్రంగా ఉంది. ఈ ఏడాది ఆశించిన మేర వరి నారు లేకపోవడంతో నారుకు చాలా డిమాండ్ పెరిగింది. నారు మడులు వేసే సమయంలో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో మెట్ట ప్రాంతాలు, వర్షాధారణ ప్రాంతాల్లో ఈ ఏడాది వరి నారు ఆశించిన మేర ఎదుగుదల రాలేదు. కొన్ని ప్రాంతాల్లో నీరు లేక నారు ఎండిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో నారు కొరత చాలా ఎక్కువగా ఉంది. మరో పక్క ఖరీఫ్ వరి నాట్లు వేసే దశ కూడా ముగింపునకు రావడంతో నాట్లుకు కావలసిన వరి నారుకు తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో అదనపు ఖర్చు పెట్టి రైతులు నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. చోడవరం నియోజకవర్గంలో సుమారు 23 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 63 శాతం


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వరినారు

నాట్లు వేశారు. ప్రస్తుతం వర్షాలు కూడా అనుకూలించడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు కాకుండా వరి పంట వేసేందుకు మొగ్గుచూపుతున్నారు. అయితే జూన్, జులై నెలల్లో వర్షపాతం ఆశించిన మేర కురవకపోవడంతో మెట్టప్రాంతాల్లో చాలా చోట్ల వరి నాట్లు కావలసిన నారు లభించలేదు. ఈ నెలాఖరుతో ఈ ఖరీఫ్ వరి నాట్లు వేయడానికి గడువు కూడా ముగుస్తుండటం వల్ల వరి నారుకు మంచి డిమాండ్ వచ్చింది. అయితే నాట్లుకు కావలసిన వరి నారు లేకుండా పోయింది. ఎందుకంటే నారు ఎదగాల్సిన సమయంలో ఆశించినమేర వర్షాలులేకపోవడం, కొన్ని చోట్ల నారుకు తెగుళ్లు సోకి నాశనమవ్వడంతో నారు కొరత ఏర్పడింది. నారుకోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతుల వద్ద ఉన్నఅదనపు నారును రూ.1600నుంచి 2వేలకు కొనుగోలుచేస్తున్నారు. అంతేకాకుండా ఆ నారును మడిలోంచి తీయడానికి కూలీలకు అదనపు మరో రూ.1500వరకు ఖర్చుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కొనుగోలుచేసిన నారును పొలంలో ఉడిచేందుకు మరో రూ.2వేలు ఖర్చుచేయాల్సి రావడంతో అదనపు పెట్టుబడులతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మరో పక్క వరి నారుకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులు పొలాల్లో దాచుకుంటున్నారు. ప్రస్తుతం వరి నారుకు ఎంత డిమాండ్ ఉందో చెప్పకనే చెబుతుంది. ఇదిలావుంటే ఈ వారంలో వరి నాట్లు పూర్తిగా వేసేందుకు పల్లం, మెట్ట రైతులు ఇప్పటికే దమ్ములు పట్టి, నాట్లు వేయడం ముమ్మరం చేశారు.

నారు లేకపోతే వెదజల్లే పద్ధతిలో వేసుకోవాలి

వరి నారు లేనివారు విత్తనాన్ని వెదజల్లే పద్ధతిలోను, డ్రమ్ సీడర్లతో వేసుకోవచ్చని వ్యవసాయశాఖ చోడవరం అదనపు సంచాలకుడు రవీంద్రనాథ్ సూచించారు. పొలంలో నీరు పూర్తిగా ఆరిపోయిన తర్వాతే వెద విత్తనాన్ని వేయాలని ఆయన చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో వివిధ విభాగాలకు అధ్యక్షుల నియామకం



నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ విభాగాలకు అధ్యక్షులను ప్రకటించారు. నర్సీపట్నం మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా పెట్ల అప్పలనాయుడు, సుకల నూకరాజు(సాంస్కృతిక విభాగం), మావూరి ఉమాదేవి(మహిళా విభాగం), బోళెం వెంకటేష్(పంచాయతీరాజ్ విభాగం), గుడివాడ లోవరాజు(పబ్లిసిటీ విభాగం), పి.పి.నాయుడు(ఆర్‌టీఐ విభాగం), మాకిరెడ్డి వెంకునాయుడు(రైతు విభాగం), చేవల నాగేశ్వరరావు(ఎస్సీ సెల్), లగుడు రామచంద్ర(సోషల్ మీడియా విభాగం), మాకిరెడ్డి నాగేంద్రకుమార్(స్టూడెంట్ విభాగం), జి.మురళీకృష్ణ(యువజన విభాగం), మడ్డు లోవ ప్రసాద్(మండల ఓటర్ల విభాగం), దన్నిన సురేష్‌నాయుడు(యూత్ వింగ్) నియామకమయ్యారు.

- మున్సిపాలిటీ బీసీ సెల్ విభాగం అధ్యక్షుడిగా బయపురెడ్డి చినబాబు, తానేటి జాన్(క్రిస్టియన్ విభాగం), యలమంచిలి నాని(సాంస్కృతి విభాగం), కుపరాల దీపక్(దివ్యాంగులు విభాగం), కణితి అన్నపూర్ణ(మహిళా విభాగం), కరుణం చిన్న(పబ్లిసిటీ), మళ్ల గణేష్(ఆర్‌టీఐ విభాగం), లాలం అప్పారావు(రైతు విభాగం), ఆరుగుల్ల రాజుబాబు(ఎస్సీ సెల్ విభాగం), చామంతుల సురేష్(సోషల్ మీడియా), రేవు రాధాకృష్ణ(స్టూడెంట్ విభాగం), దేవత కామేష్(యువజన విభాగం), ఎం.నాగు(వీవర్స్ విభాగం), దాడి సత్య రామకృష్ణ(మున్సిపల్ వింగ్), యూత్ అధ్యక్షుడిగా అల్లంపల్లి ఈశ్వరరావుతో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జాయింట్ కార్యదర్శులను నియమించారు.

శాస్త్రోక్తంగా దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ట

చీడికాడ: దండిసురవరంలో గురువారం దుర్గాలమ్మ ఆలయ ప్రారంభోత్సవంతో పాటు విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. సర్పంచ్ కోన అర్జున ఆధ్వర్యంలో ఈ వేడుకలు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. అంకురార్పణతో ప్రారంభమైన వేడుకలు గురువారం విగ్రహ ప్రతిష్ఠతో ముగిశాయి. అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చీడికాడ, దేవరాపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు, ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, తదితరులు దర్శించుకున్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు

మత్తుపై ఉక్కుపాదం

- విస్తృతంగా అవగాహన సదస్సులు
- డీఎస్పీ శ్రీనివాసరావు



నర్సీపట్నం: ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య డ్రగ్స్, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపామని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. మాదక ద్రవ్యాల కట్టడికి, యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా పోలీసులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మత్తు పదార్థాల వాడకం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు చర్యలు చేపడుతున్నారన్నారు. అయినప్పటికీ కొందరు యువత, విద్యార్థులు వీటికి అలవాటు పడి వారి జీవితాలు చీకటిమయం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిపై మార్పు తీసుకువచ్చేందుకు పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. మాదక ద్రవ్యాల మహమ్మారిని అరికట్టడానికి పోలీసులు, విద్యాసంస్థల యాజమాన్యాలు సంయుక్తంగా చర్యలు చేపడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల కట్టడికి ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. యువత చెడు దారిలో వెళ్లకుండా ఉండేందుకు డ్రగ్స్ వినియోగించకుండా చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల జోలికి పోకుండా సురక్షితమైన వాతావరణంలో విద్యార్థులు తమ చదువులు కొనసాగించాలన్నారు. డ్రగ్స్ వల్ల విద్యార్థులు కేసులతో ఇబ్బందులు పడడమే కాకుండా ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. సమాజంతో మనకున్న సంబంధాలు మొత్తం తెగిపోతాయన్నారు. విద్యార్థులు డ్రగ్స్ వాడే వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సూచించారు.

మూతపడే పాఠశాలల ప్రారంభానికి చర్యలు


కళ్యాణ కొత్తూరులో గ్రామ పెద్దలతో సమావేశమైన ఎంఈవో జాను ప్రసాద్

రోలుగుంట: మండలంలో జీరో ఎన్‌రోల్‌మెంటుతో మూత పడే దశలో ఉన్న పాఠశాలల పునః ప్రారంభానికి ఎంఈవోలు 1, 2 జాను ప్రసాద్, జగ్గారావు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా అడ్డసరం పంచాయతీ శివారు జీరో ఎన్‌రోల్‌మెంటులో ఉన్న కళ్యాణ కొత్తూరు ఎంపీపీ పాఠశాలను ప్రారంభించేందుకు గ్రామ పెద్దలతో వారు సమావేశమయ్యారు. ఒకసారి మూత పడితే మళ్లీ ఆ పాఠశాల ఇదే గ్రామానికి రావడానికి ఎదురయ్యే సమస్యలు వివరించారు. గ్రామస్తులు తమ పిల్లలను ఇక్కడి పాఠశాలలో చేర్పించి పునరుద్ధరించుకోవాలని వారు కోరారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ మండలంలో జీరో ఎన్‌రోల్‌మెంటులో ఉన్న బుచ్చింపేట పంచాయతీ శివారు గుర్రపేట పాఠశాలను గ్రామస్తుల ఆసక్తి, తీసుకున్న బాధ్యత మేరకు ప్రారంభించామన్నారు. కళ్యాణ కొత్తూరు గ్రామస్తులతో సమావేశం నిర్వహించామన్నారు. కొంతల పంచాయతీ పాపంపేటలో కూడా గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహిటించి విద్యార్థుల ప్రవేశాలు జరిగితే త్వరలోనే పాఠశాలను ప్రారంభిస్తామని చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నర్సీపట్నం: ఈ నెల 17న జరగనున్న ఏపీడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోషల్ మీడియాలో మంచి, చెడు.. సమాజంపై దాని ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు ఈ పోటీలు జరిగాయి. విజేతలకు ఆవిర్భావ దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బేరా చినబాబు, విజయ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు.